

నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్-2023 కౌన్సెలింగ్ ముగియనుంది. సోమవారం 1,08,001వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దేవదాయ శాఖ కమిషనర్, సెక్రటరీ ఎస్. సత్యనారాయణ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

97.67శాతం పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా గుంటూరు జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆదివారం పెన్షన్లు అందజేశారు. జిల్లాలో ఆదివారం నాటికి 97.67 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. ఆదివారం సాయంత్రానికి 2,45,416 మంది లబ్ధిదారులకు రూ.67.41 కోట్ల నగదు అందజేశారు. నేటి సాయంత్రంతో పింఛన్ల పంపిణీ ముగియనుంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

రేపు జలశక్తి మిషన్ సభ్యుల పర్యటన



జూపూడి(ఇబ్రహీంపట్నం): ఈ నెల ఆరో తేదీన కేంద్ర జలశక్తి మిషన్ సభ్యులు జూపూడిలో పర్యటిస్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. మండలంలోని జూపూడిలో ఆదివారం ఆయన పర్యటించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ పర్యటిస్తారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ పనితీరు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంటారని పేర్కొన్నారు. కేంద్రం నిధులతో చేపట్టిన వివిధ పథకాల నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. డీపీవో జె.సునీత, ఎంపీడీవో రామకృష్ణ నాయక్, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

వైద్య కళాశాలలు రెట్టింపు చేసిన ప్రధాని మోదీ

కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్



గుంటూరు మెడికల్: దేశ వ్యాప్తంగా 2014కు ముందు ఉన్న వైద్య కళాశాలలను ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో రెట్టింపు చేశారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్ అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో బీజేపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో వైద్యులతో ముఖాముఖి సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. కేంద్ర మంత్రి ప్రవీణ్‌పవార్ మాట్లాడుతూ అఖిల భారత విజ్ఞాన సంస్థల్ని కూడా ప్రతి రాష్ట్రంలో ఏర్పాటు చేయటానికి ప్రధాని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో వైద్యుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనంతరం పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో ఆమె సమావేశమయ్యారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిపుష్టిలో వ్యాపారుల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలిపారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. దేశంలో వ్యాపార రంగంలో ఈజీ ఆఫ్ డూయింగ్‌లో ప్రపంచంలోనే మంచి స్థానం తీసుకొచ్చిన ఘనత ప్రధానికే దక్కుతుందని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాకా సత్యనారాయణ, మాగంటి సుధాకర్ యాదవ్, పాతూరి నాగభూషణం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

‘భవన’ విజయం!

గ్రామాల్లో ప్రభుత్వ భవంతుల శోభ

- శరవేగంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు
- జిల్లాలో నాలుగేళ్లలో రూ. 286.7 కోట్లతో అభివృద్ధి పనులు
- 459 పంచాయతీల్లో 1053 భవనాలు ఏర్పాటు
- ఇప్పటికే 41 సచివాలయాలు, 23 రైతుభరోసా కేంద్రాలు ప్రారంభం
- వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సెంటర్లు 8 ప్రారంభం
- సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 981 ప్రభుత్వ కార్యాలయాలు



అడవి పంచాయతీలో ప్రారంభించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

బాపట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యతా భవనాలతో పల్లెలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. పల్లె ప్రజలకు అవసరమైన అన్నిరకాల సేవలను అందుబాటులో ఉంచేందుకు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌కు శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లాలో మొత్తం 459 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిల్లో ప్రాధాన్యత భవనాలను 1053 ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఆయా గ్రామాల్లో ఆధునాతన సౌకర్యాలతో మూడు భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. అందులో భాగంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిర్ణీత సమయంలోగా వీటిని పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం విశేష కృషిచేస్తున్నారు.

శరవేగంగా నిర్మాణపనులు

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగం పెంచేందుకు వారంలో మూడు రోజులు రాష్ట్రస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు జిల్లా అధికారయంత్రాగం చర్యలు చేపట్టింది.

ఒక్కో భవనానికి ఎంత వెచ్చిస్తున్నారంటే..

గ్రామ సచివాలయానికి రూ. 40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.17.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.



ముత్తాయపాలెంలో నూతనంగా ప్రారంభించిన గ్రామ సచివాలయ భవనం

జిల్లాకు రూ.286.7 కోట్లు...

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకోసం జిల్లాకు రూ. 286.7 కోట్లు నిధులు కేటాయించారు. ఇప్పటికే సుమారు రూ. 200 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. ప్రాధాన్యత ప్రకారం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి పూర్తిచేసిన పనులకు వెనువెంటనే బిల్లులు మంజూరు చేస్తూ సంబంధిత అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు. గ్రామ సచివాలయాలకు మొత్తానికి రూ. 158 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే సుమారు రూ.90 కోట్లు వరకు ఖర్చుచేశారు. రైతు భరోసా కేంద్రాలకు రూ.68.7 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే రూ.38 కోట్లు వరకు ఖర్చుచేశారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లకు రూ.60 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే రూ.33.5 కోట్లు మంజూరు చేశారు.

సెప్టెంబర్ నాటికి పూర్తిచేసేవిధంగా ప్రణాళిక



జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలను సెప్టెంబర్ నాటికి పూర్తిచేసేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాం. జిల్లాలోని అన్నిమండలాల ఏఈలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. అధిక శాతం ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న 981 ప్రభుత్వ భవనాలు వెంటనే పూర్తిచేసి, సెప్టెంబర్ 23 నాటికి ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నాం.

– జి.బుచ్చంబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ, బాపట్ల జిల్లా

జిల్లా సమాచారం...

భవనాలు	మంజూరు	అంచనా మొత్తం	పూర్తిచేసినవి (రూ. కోట్లలో)	వివిధ దశల్లో ఉన్నవి
గ్రామసచివాలయాలు	395	158	41	354
రైతుభరోసాకేంద్రాలు	315	68.7	23	292
వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు	343	60	08	335

పర్యావరణానికి పెనుముప్పు

- ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పంపిణీకి సిద్ధంగా ఉంచిన మొక్కలు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్‌యార్డు

బాపట్ల: ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. ప్రకృతిని కాపాడుకోవటంతోపాటు జీవరాసులకు ప్లాస్టిక్‌తో కలిగే ముప్పును నివారించేందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలి. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్లాస్టిక్ వాడకం నేడు గ్రామీణ ప్రాంతంలో విపరీతంగా పెరిగింది. ప్లాస్టిక్ నివారణకు ఒక పక్కన చర్యలు తీసుకుంటున్నప్పటికీ మరోవైపు వాడకంలో మాత్రం ఏమాత్రం తగ్గటంలేదు.

వ్యర్థాలే అధికం..

బాపట్ల జిల్లాలోని రోజువారీగా చెత్తచెదారం 38 టన్నులు వస్తే వాటిలో రెండు టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. చీరాల మున్సిపాల్టీలో 42 టన్నులు చెత్తరాగా ఇందులో ఒక టన్ను, రేపల్లె మున్సిపాల్టీలో 25 టన్నులు చెత్త వస్తే అందులో 75 కేజీలు, అద్దంకిలో 20 టన్నులు చెత్తరాగా అందులో 70 కేజీలు మేరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం మున్సిపాల్టీలతో పాటు 25మండలాల పరిధిలోని 459 గ్రామాల్లో అదనంగా రోజు వారీగా 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి.

ప్లాస్టిక్ కట్టడికి చర్యలు...

ప్లాస్టిక్ వ్యర్థాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చట్టం తీసుకొచ్చింది. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, ఫోర్కులు, బెలూన్స్, ఐస్ క్రీమ్ స్టిక్స్, స్ట్రాలు తదితర వస్తువుల తయారీ రవాణ వినియోగాన్ని నిషేధించింది. పాలిథిన్ కవర్లలో అతి తక్కువ మందం ఉండే వాటిని స్పష్టం చేసింది. మొదట్లో 75 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉంది. 120 మైక్రాన్ల కన్నా తక్కువ వాటిని సైతం నిషేధిత జాబితాలో చేర్చింది.

మొక్కల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ..

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడాదికి బాపట్ల జిల్లాలోని 25 మండలాల్లో 1.75లక్షల మొక్కలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ నెలాఖారు నుంచి సెప్టెంబరు వరకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముమ్మరంగా చేపడుతోంది. ఈఏడాది కూడా పంపిణీకి సిద్ధంగా బాపట్లలోని సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో 1.75లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. పండ్లు, పూల మొక్కలతోపాటు వివిధ రకాలైన మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానా



ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విక్రయదారులకు రూ.25వేల వరకు జరిమానా విధించటంతోపాటు పలుసార్లు కేసుల్లో చిక్కితే వారి ట్రేడ్ లైసెన్సును కూడా రద్దు చేస్తాం. బాపట్ల మున్సిపాల్టీ పరిధిలో ఈపాటికే ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించటం జరిగింది.

– ఎ.భానుప్రతాప్, మున్సిపల్ కమిషనర్, బాపట్ల

హామీలకు విలువ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు, వేదికపై మంత్రి అంబటి, డొక్కా తదితరులు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

పట్నంబజారు: ఇచ్చిన మాటకు కట్టుబడే నైజం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు హిందూ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం 'మేనిఫెస్టో అంటే జగన్' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా ఒడిశా రైలు ప్రమాద మృతులకు సంతాపాన్ని తెలియజేస్తూ.. రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం కొమ్మినేని మాట్లాడుతూ 2019 వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే సరికి కనీసం రూ.100 కోట్లు కూడా లేకుండా చంద్రబాబు ఖజానాను ఖాళీ చేశారని, దీనికి తగ్గట్లుగానే ఎల్లో మీడియా చెత్త రాతలు రాస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు చూస్తున్నామన్నారు.

హామీలన్నీ నెరవేర్చారు : మంత్రి అంబటి

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు.. అమలు చేసిన వైనాన్ని.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. అమలు చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. మేనిఫెస్టో తీసుకుని ప్రతి గడపకు వెళ్లే ధైర్యం తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్ తమకిచ్చారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేశారని గర్వంగా ప్రతి కార్యకర్త చెప్పుకుంటున్నారన్నారు. చంద్రబాబు టీడీపీ దుకాణం తెరిచిన నాటి నుంచి ప్రజలకు ఏ ఒక్క మేలు చేయలేదని తేల్చిచెప్పారు.

చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో లేకుండా చేశారు : ఉమ్మారెడ్డి

శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో మేనిఫెస్టో చించివేసిన పరిస్థితులు ఉన్నాయని, చంద్రబాబు వెబ్‌సైట్‌లో లేకుండా చేసిన దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయన్నారు.

టీడీపీ నేతల్లోనే ఆందోళన : డొక్కా

సభాధ్యక్షత వహించిన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను చూసి టీడీపీ నేతల్లోనే ఆందోళన మొదలైందని, ఇటువంటి హామీలు కేవలం అధికారం కోసం ఇవ్వటమేనన్న విషయం ప్రతి ఒక్కరికీ అర్థమైందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నంలు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, పార్టీ నేతలు పోలూరి వెంకటరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండేపూడి పురుషోత్తం, డాక్టర్ వై.షేక్, సీడీ భగవాన్, పెరికల కృష్ణమోహన్, మాదా రాధాకృష్ణమూర్తి, గనిక ఝాన్సీ, వేమారెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో పెద్ద ‘సాయం’

- హైరిస్క్ గర్భిణి కేసులను పల్నాడు జిల్లా నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలింపు
- గర్భిణులకు సహాయంగా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసిన పల్నాడు వైద్య ఆరోగ్య శాఖ
- మూడు షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు
- పల్నాడు నుంచి వచ్చే రోగులకు త్వరితగతిన వైద్యం అందేలా చర్యలు
- 24 గంటల పాటు రోగులకు అవసరమైన సేవలు అందుతాయంటున్న ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ సునీల

సాక్షి, నరసరావుపేట: మహిళలకు ప్రసవం పునర్జన్మతో సమానం. బిడ్డకు జన్మనివ్వాలంటే చచ్చి బతకాల్సిందే. అదే హైరిస్క్‌లో ఉన్న గర్భిణుల పరిస్థితి మరి క్లిష్టంగా ఉంటుంది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటానికి వారిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వారికి అవసరమైన పౌష్టికాహారం, ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. ప్రసవానికి రెండు మూడు రోజుల ముందే వారికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంచడానికి జిల్లా పెద్దాసుపత్రులకు ప్రభుత్వమే రవాణా ఖర్చులు భరించి తరలిస్తున్నారు. పల్నాడు జిల్లాలో సైతం ఇదేవిధంగా హైరిస్క్ ఉన్న గర్భిణులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించి, సుఖ ప్రసవం అయ్యేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఐతే జిల్లా విభజన తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు వెళుతున్న పల్నాడు గర్భిణులకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఓ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయమని వైద్య అధికారులను ఆదేశించారు.



గుంటూరు జీజీహెచ్‌లో పల్నాడు హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర

పల్నాడు హెల్ప్ డెస్క్...

కలెక్టర్ ఆదేశాల మేరకు పల్నాడు ప్రాంతం నుంచి వెళ్లే గర్భిణులకు ఉపయుక్తంగా ఉండేలా పల్నాడు హెల్ప్ డెస్క్‌ను గుంటూరు జీజీహెచ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. అందులో మూడు షిఫ్టుల వారీగా ముగ్గురు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య మిత్రలను నియమించారు. అక్కడికి వైద్యం కోసం వెళ్లిన గర్భిణులతో హెల్ప్ డెస్క్ సిబ్బంది మాట్లాడి వారికి అవసరమైన సమాచారం, సూచనలు అందజేస్తారు. సత్వరమే మెరుగైన వైద్యం అందేలా హెల్ప్ డెస్క్ సిబ్బంది వైద్యులు, గర్భిణుల మధ్య వారధిగా పనిచేస్తున్నారు.

దీని వల్ల హైరిస్క్‌తో ఉన్న గర్భిణులకు సమయం వృథా కాకుండా, కంగారుపడకుండా వెంటనే వైద్యం అందుతుంది. వైద్యం అనంతరం బాలింత, చిన్నారిని ఇంటికి ఉచితంగా తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పంపించేవరకు ఆరోగ్య మిత్రలు సహాయంగా ఉంటారు. దీంతో తల్లి, బిడ్డ ఇద్దరు సురక్షితంగా ఇంటికి చేరడానికి ఉపయుక్తంగా పల్నాడు హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతోంది.

24 గంటలు అందుబాటులో హెల్ప్ డెస్క్



గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన పల్నాడు జిల్లా హైరిస్క్ గర్భిణులు ఇబ్బందిపడకూడదన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలతో పల్నాడు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో ముగ్గురు ఆరోగ్య మిత్రలు షిఫ్టుల వారీగా 24 గంటలు అందుబాటులో ఉంటారు. గర్భిణులకు సత్వరమే, మెరుగైన వైద్యం అందుతోంది. ఈ సదుపాయాన్ని జిల్లాకు చెందిన గర్భిణులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ సునీల, పల్నాడు జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్

ఎంతో ఉపయోగపడుతోంది



ప్రసవం కోసం రెండు నెలల క్రితం గుంటూరు జీజీహెచ్‌కు నన్ను తరలించారు. అక్కడ పల్నాడు హెల్ప్ డెస్క్ సిబ్బంది మాకు అవసరమైన సలహాలు అందజేశారు. వెంటనే తగిన వైద్యం అందేలా వారు మాకు సహాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లిన మాలాంటి వారికి హెల్ప్‌డెస్క్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

– షేక్ రేష్మ, బాలింత, పిన్నెల్లి, మాచవరం మండలం

ముఖ్యమంత్రి రాకకు ఏర్పాట్లు పరిశీలన

క్రోసూరు: ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా క్రోసూరు రానున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకరరెడ్డి, జేసీ ఎ.శ్యాంప్రసాద్ ఆదివారం పరిశీలించారు. క్రోసూరు నుంచి జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని ప్రారంభించటంతో పాటు, పలు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. ఈమేరకు క్రోసూరు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్, బయ్యవరం, ఊటుకూరు జెడ్పీ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం క్రోసూరు మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు బందోబస్తు నిర్వహణ, పార్కింగ్, హెలిప్యాడ్, రూట్‌మ్యాప్, శంకుస్థాపన, ప్రారంభోత్సవ ప్రాంతాలు, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతం మొత్తం పటిష్ట భద్రత ఏర్పాట్లుపై చర్చించారు. అమరావతి నుంచి బెల్లంకొండ మండలాలను కలుపుతూ డబుల్‌లైన్ ప్రధాన రహదారి, మాదిపాడు వద్ద కృష్ణానదిపై భారీ వంతెన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్రోసూరు శివారులో అమరావతి రోడ్డు విప్పర్లగ్రామం వద్ద నూతనంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి బహిరంగ సభలో మాట్లాడతారని వివరించారు. సమీక్షా సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావు, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఈఓ శామ్యూల్, జిల్లా రహదారులు, భవనాలశాఖ అధికారి రాజునాయక్, ఆర్డీఓ రాజకుమారి, ఆయా శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి పాల్గొన్నారు.



క్రోసూరు జెడ్పీపాఠశాలలో సీఎం సభ వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర రెడ్డి

ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

- నూతన సాగు విధానాలతో భూసారాన్ని కాపాడాలి
- జేసీ రాజకుమారి



నాగలి పట్టి ఏరువాక సాగుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి

గుంటూరు రూరల్: రైతులు నూతన సాగు యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన అధిక పంట దిగుబడులు సాధించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఆకాంక్షించారు. జొన్నలగడ్డలో ఏరువాక పౌర్ణమి ఆదివారం పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని నాగేంద్ర స్వామి పుట్ట క్షేత్రంలో సంయుక్త కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. పొలంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వయంగా జోడు ఎద్దులతో ఉన్న నాగలిని పట్టి పొలం దున్నారు. ట్రాక్టర్ నడుపుతూ కొద్దిసేపు పొలం దున్ని విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్ లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ తమది వ్యవసాయ కుటుంబమని, తన తండ్రి రైతని, విద్యార్థి దశలో సెలవుల సమయంలో వ్యవసాయ పనులలో పాల్గొన్న అనుభవాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా ద్వారా పంటలకు పెట్టుబడి సాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. పంటల బీమాకు పూర్తి ప్రీమియం రైతుల తరుపున ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అత్యధునికమైన వ్యవసాయ యంత్ర పరికరాలను గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతున్నారని వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి రైతులు ఏరువాక పౌర్ణమి రోజు భూమాతకు, పశుగణాలకు పూజ చేసి పండుగగా పంటల సాగును ప్రారంభిస్తారన్నారు. జొన్నలగడ్డ గ్రామం తొలిసారిగా మెట్టవరిని ప్రయోగాత్మకంగా సాగు చేసి సఫలీకృతమై రాష్ట్ర వ్యాప్తంగా రైతులు మెట్ట వరిని సాగు చేసే ఘనత సాధించిందని చెప్పారు. ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయం అందిస్తుందని వివరించారు. గ్రామంలోని రైతులకు పచ్చి రొట్ట విత్తనాలను జిల్లా సంయుక్త కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ తోటకూర శ్రీనివాసరావు, తూర్పు మండల తహసీల్దార్ నగేష్, జొన్నలగడ్డ గ్రామ ఉప సర్పంచి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి సంబరం

- విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించిన రైతులు
- పొలంబాట పట్టిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విఘ్నేశ్వర ఆలయం వద్ద అరకలు, ఎద్దులు, ట్రాక్టర్లు

మంగళగిరి: నగర పరిధిలోని కాజలో ఆదివారం ఏరువాక పౌర్ణమిని పండుగలా నిర్వహించారు. రైతులు కాజ సెంటర్‌లోని అగస్తేశ్వర స్వామి(శివాలయం) ప్రాంగణంలోని విఘ్నేశ్వరస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుని సన్నిధిలో వృషభ పూజ నిర్వహించి నాగళ్లు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలు, అరకలు కట్టి పసుపు, కుంకుమలతో అలంకరించి ర్యాలీగా పొలాల్లోకి వెళ్లి దుక్కులు దున్నారు. ఏరువాక ఉత్సవాన్ని తిలకించేందుకు నగర చుట్టు పక్కల నుంచి భారీగా భక్తులు, రైతులు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో రైతు మారెళ్ల సత్యమారెడ్డి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పెదకాపులు సింహాద్రి వెంకట రామారెడ్డి, కుక్కల కోటేశ్వరావు, బొమ్ము పిచ్చిరెడ్డి, చెన్నం శ్రీనివాసరావులు భక్తులకు ఉండ్రాళ్ల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఏరువాక పౌర్ణమి కాజలో పండుగ వాతావరణాన్ని తలపించింది.

యర్రబాలెంలో...

ఏరువాక పౌర్ణమి సందర్భంగా నగర పరిధిలోని యర్రబాలెంలోని వినాయకుని గుడి వద్ద ఆదివారం రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు అరకలు, ట్రాక్టర్లను పూలమాలలతో అలంకరించి వినాయకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి అనంతరం పంట పొలాల్లోని దుక్కులు దున్నేందుకు బయలు దేరి వెళ్లారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంపీ మోపిదేవి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: క్రీడలు శారీరిక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నిజాంపట్నంలో ఆదివారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబుల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఎంపీ మోపిదేవి టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు, 4వ బహుమతి రూ.25వేలు అందిస్తామని తెలిపారు.అనంతరం గ్రౌండ్‌లో ఎంపీ మోపిదేవి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథబాబు, నాజర్‌ఖాన్, నాయుడు వెంకటేశ్వరరావు, దిండి సరస్పంచ్ యేమినేని రాంబాబు, జమీర్, చెన్ను లక్ష్మణరావు(ఎల్‌జి)తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష ఆర్థిక సహాయం

మండలంలోని గుర్నాధనగర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ నెల 11వ తేదీ అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావును ఆదివారం గ్రామస్తులు కలిసి కోరారు. తప్పనిసరిగా విగ్రహావిష్కరణకు వస్తానని హామీనిచ్చి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ అశోక్, గ్రామస్తులకు ఎంపీ మోపిదేవి అందజేశారు.

రంగస్థల నటుడు సుబ్బారావు మృతి



మేదరమెట్ల: ప్రముఖ రంగస్థల నటుడు చలివేంద్ర సుబ్బారావు (57) ఆదివారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలంలోని బొల్లవరప్పాడు గ్రామానికి చెందిన సుబ్బారావు వందలాది నాటకాల్లో పలు పాత్రలు పోషించారు.

సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడు, కాలకౌసికుడు, వీరబాహుడు, పాత్రలతో పాటు చింతామణిలో సుబ్బిసెట్టి పాత్రలో జీవించి ప్రేక్షకులను మెప్పించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన మృతి పట్ల పలువురు రంగస్థల కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బారావు పార్థివదేహానికి స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు స్నేహితులు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

బాపట్లటౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగేలా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీలు, పాత నేరస్తుల కదలికలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలన్నారు. వారితో సన్నిహితంగా ఉండే వ్యక్తుల వివరాలు, జీవనోపాధి ఇతర సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. వారు కలుస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచి, మరలా ఏదైనా నేరం చేసే అవకాశం ఉన్నదా అనే సమాచారాన్ని సేకరించాలన్నారు. ఒక స్టేషన్ పరిధిలో నివాసం ఉన్న నేరస్తులు ప్రస్తుతం వేరొక పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నట్లయితే వారికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు తెలియజేయాలన్నారు. నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ అధికారులు పంచుకున్నప్పుడే నేరస్తులు చేయబోయే నేరాలను ముందుగానే గుర్తించి నియంత్రించడానికి అవకాశం ఉంటుందన్నారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో ఉండాలని ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమన్నారు. ఎక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆదేశాలను, సూచనలను పెడచెవిన పెట్టి ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై పీడీ యాక్ట్ అమలుపరిచి జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

జానపద సాహిత్యంలో దిట్ట ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి



పేట శ్రీనివాసరెడ్డికి సీతారామమూర్తి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న దివాకరదత్తు

అద్దంకి రూరల్: జానపద సాహిత్యంలో ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డి దిట్ట అని రచయిత నారాయణం బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో అభినవసూరన గాడేపల్లి సీతారామమూర్తి స్మారక సృజన సాహిత్య పురస్కారం-2022ను గాడేపల్లి సీతారామమూర్తి కుమారుడు దివాకరదత్తు, చంద్రదత్ అందజేశారు. కార్యక్రమానికి అనిల కుమారసూరి అధ్యక్షత వహించారు. నారాయణం బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుమల వీధుల స్థలనామాలను పేట శ్రీనివాసరెడ్డి అద్భుతంగా వర్ణించారన్నారు. చిత్తూరు జిల్లాలోని పల్లెపాటలు, కొండకోనల్లో తిరుపతి కథలు రచించిన పేట శ్రీనివాసరెడ్డి యునెస్కో అవార్డు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి శ్రీమన్నారాయణ, జాగర్లమూడి ప్రతాప్, ముధురాంతకం నరేంద్ర, షేక్‌మహమ్మద్ రఫీ, ఆర్.రాఘవరెడ్డి, డీవీఎం సత్యనారాయణ, లెవీ ప్రసాద్, పాలపర్తి జ్యోతిష్మతి, అంజాద్ బాషా, ఎస్‌కే మస్తాన్, పీసీహెచ్ కోటయ్య, అనంతు నాగేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, సంకబాబు, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తం



శివప్రసాద్ హృదయాలయను ప్రారంభిస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుండె శస్త్ర చికిత్స నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.గోపాలకృష్ణ గోఖలే అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ శివప్రసాద్ హృదయాలయను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోఖలే మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలను గుర్తించి గంటలోపు చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. మొదటి మూడు గంటల సమయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్డియాలజిస్టు డాక్టర్ పి.శివప్రసాద్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా కోస్తాంధ్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా రాష్ట్ర స్థాయి పోల్‌రాధా పోటీలు



బండ లాగుతున్న గుంటూరు ఎడ్ల జత

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల పురస్కరించుకొని ఆదివారం రాత్రి రాష్ట్ర స్థాయి జూనియర్ నాటు ఎడ్ల పోల్ రాధా పోటీలు రసవత్తరంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సుమారు 16 ఎడ్ల జతలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. 300 మీటర్ల పొడవు, రెండు క్వింటాళ్ల ఇసుక బస్తాలను వేసుకొని బండిని లాగాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నీరకట్టు రామారావు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

తెనాలిరూరల్: తెనాలి మండలం హాఫ్‌పేట గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం చెందింది. వివరాలు.. పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి అనూరాధ(44) తన కొడుకుతో కలసి బైక్‌పై తెనాలి మండలం కొలకలూరు వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో లారీ కింద పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న కుమారుడు మణికంఠ చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. అనారోగ్యంతో ఉన్న తన తల్లికి ఇంజెక్షన్ చేయించేందుకు వెంకటకృష్ణాపురం నుంచి కొలకలూరు గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకువెళుతున్నట్లు మణికంఠ తెలిపాడు. దారి మధ్యలో వెనుక నుంచి తాము వెళ్తున్న పల్సర్ బైక్ సైలెన్సర్ ను లారీ ఢీకొనడంతో తల్లి లారీ కింద పడి మృతి చెందిందని వివరించాడు. మృతురాలు అనూరాధకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

మానసిక సమస్యలతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

మార్టూరు: ఒంటరితనం ఆపై మానసిక సమస్యలతో ఓ లారీ డ్రైవర్ తాను నిత్యం నడిపే లారీ టైర్ల కింద తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చిలకా భాస్కర్‌బాబు (55) చాలా కాలంగా జంగమహేశ్వరపురంలోని ఏ. ప్రభాకరరెడ్డికి చెందిన క్రషర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో అనారోగ్యం కారణంగా భార్య మరణించింది. అప్పటి నుంచి భాస్కర్‌బాబు ఒంటరితనంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు గుర్తించి కాపాడారు. ఆదివారం ఉదయం భాస్కర్‌బాబు తాను నిత్యం నడిపే లారీ వద్దకు వెళ్లి లారీని గేరు నుంచి న్యూట్రల్ చేయడంతో కిందకు దిగే క్రమంలో లారీ కుడివైపు వెనక టైర్ల కింద తలపెట్టి పడుకున్నాడు. లారీ భాస్కర్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రత్నకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కమలాకర్ ఘటనా స్థలికి వెళ్లి భాస్కర్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్రెయిన్‌లో చిప్స్‌తో వణుకుడు జబ్బుకు చెక్

- ఎనిమిదేళ్ల సమస్య నుంచి రోగికి విముక్తి
- రోగి మెలకువలో ఉండగానే డీబీఎస్ ఆపరేషన్
- 13 గంటలసేపు కొనసాగిన ఆపరేషన్
- విలేకరుల సమావేశంలో గుంటూరు న్యూరో సర్జన్లు వెల్లడి

గుంటూరు మెడికల్: వణుకు సమస్యతో ఎనిమిదేళ్లుగా బాధపడుతున్న ఓ మహిళకు గుంటూరు న్యూరో సర్జన్లు విముక్తి కలిగించారు. సుమారు 13 గంటలసేపు అరుదైన ఆపరేషన్ చేసి ఆమె సమస్యల్ని తొలగించారు. అమెరికా నుంచి సుమారు ఆరు కోట్ల రూపాయల ఖరీదు చేసే అత్యాధునిక వైద్య పరికరాన్ని గుంటూరుకు తెప్పించి రోగి మెలకువగా ఉండగానే డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ అనే అరుదైన సర్జరీ చేసి రికార్డు సృష్టించారు. ఆదివారం గుంటూరు కొత్తపేటలోని బ్రింద హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో న్యూరోసర్జన్లు డాక్టర్ అంకటి ప్రవీణ్, భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం కొండ్రముట్ల గ్రామానికి చెందిన 52 ఏళ్ల తోట రమణ ఎనిమిది సంవత్సరాలుగా పార్కిన్సన్స్(వణుకుడు జబ్బు)తో బాధపడుతోంది. మందులు వాడుతున్నా ఆమెకు చేయి వణుకుడు తగ్గడం లేదు. నడవలేక పోవడం, చేతితో ఏమీ పట్టుకోలేక అవస్థలు పడుతోంది. రెండు నెలల కిందట గుంటూరులోని బ్రింద హాస్పిటల్‌కు రాగా ఆమెకు పార్కిన్సన్స్ జబ్బు ఉన్నట్లు నిర్ధారించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించామని డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం రెండు సార్లు సీటీ స్కాన్, ఒకసారి ఎమ్మారై స్కాన్ పరీక్షలు చేసి రమణను ఆపరేషన్‌కు సిద్ధం చేశామని తెలిపారు. అమెరికా నుంచి మెడ్రానిక్స్ కంపెనీకి చెందిన రూ.6 కోట్లు చేసే వైద్య పరికరాల్ని కంపెనీ భారతదేశ ప్రతినిధి శ్రవణ్ సాయంతో తమ ఆస్పత్రికి అద్దె ప్రాతిపదికన తెప్పించి శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆపరేషన్ చేశామని వివరించారు. బ్రెయిన్‌కు రెండు రంధ్రాలు వేసి త్రీడీ న్యావిగేషన్ ద్వారా చిన్న బ్రెయిన్‌లో కుడివైపు నాలుగు, ఎడమవైపు నాలుగు చిప్స్ పెట్టి, డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీని విజయవంతంగా చేశామని పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం ఆమెలో వణుకు తగ్గిపోయి నడవడం, చేతులతో వస్తువులు పట్టుకోవడం చేస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా పార్కిన్సన్స్ వ్యాధి వయస్సు పెరిగేకొద్దీ వస్తుందని, ఇది సోకినవారు గుర్తించేందుకు రెండేళ్లకు పైగా సమయం పడుతుందని చెప్పారు.